RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 308 | సంపుటి 4 | శుక్రవారం | 14-08-2026 | పేజీలు 4 | వెల 3/-

## రాష్ట్రంలో కరువు రావాలని

# క్షుద్ర పూజలు

- వర్షాలు పడొద్దని క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ వ్యాఖ్యలు
- ప్రభుత్వం పడిపోవాలని కుట్రలు చేస్తున్నారని విమర్శ
- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం
- బీఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు

### బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు

*రాష్ట్రంలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని, ప్రభుత్వం పడిపోవాలని బీఆర్ఎస్ నేతలు క్షుద్ర పూజలు, చేతబడులు చేయిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కూకట్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.*



హైదరాబాద్ ఆగస్టు 13(ప్రభాత గమనం):

కూకట్‌పల్లి నియోజకవర్గంలో పేదల కోసం నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులపై అత్యంత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు కుట్ర రాజకీయాలకు దిగుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, పంటలు ఎండిపోయి కరువు రావాలని, ప్రభుత్వం పడిపోవాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ ముఖ్య నేతలు పక్క రాష్ట్రాలకు వెళ్లే అఘోరా పూజలు, క్షుద్ర పూజలు, చేతబడులు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రైతులు సంతోషంగా ఉంటే చూడలేని దుర్మార్గులు బీఆర్ఎస్ నేతలని, వారి పతనం ప్రారంభమైందని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా, దేవుళ్లను, మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై పూజల పేరుతో కుట్రలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎన్ని క్షుద్ర పూజలు చేసినా, ఎలాంటి కుట్రలు పన్నినా ప్రజాక్షేత్రంలో తమను ఏమీ చేయలేరని, దేవుడి ఆశీస్సులు, ప్రజల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉన్నాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో ఘోరంగా విఫలమయ్యారని, కేసీఆర్ కుటుంబం కేవలం ఫామ్‌హౌస్‌లు, మహలు కట్టుకోవడానికే ప్రాధాన్యమిచ్చిందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చాకే ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేరుతోందని, కూకట్‌పల్లి వ్యాప్తంగా అర్హులైన పేదలందరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయం అంటే ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం తప్ప, పక్క రాష్ట్రాలకు వెళ్లి చేతబడులు చేయించడం కాదని రేవంత్ ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూసే విపక్షాలకు ప్రజలే తగిన సమయాల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తాము అభివృద్ధి అజెండాతో ముందుకు వెళ్తుంటే.. బీఆర్ఎస్ నేతలు మాత్రం క్షుద్ర పూజల నాటకాలతో ప్రజల దృష్టిని మళ్లించే యత్నం చేస్తున్నారని, ఇకనైనా ఆ చిల్లర రాజకీయాలు పక్కనబెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. వారి గురించి మాట్లాడి తాను సమయం వృధా చేసుకోనన్నారు. ఇంతకు ముందు కాంగ్రెస్ నేతలు ఈ ఆరోపణలు చేశారు. ఇప్పుడు సీఎం రేవంత్ కూడా ఇదే తరహా ఆరోపణలు చేయడం ఆసక్తికరంగా మారింది.



2

## తెలంగాణలో 36,353

# పోలింగ్ కేంద్రాలు

- కొత్తగా 368 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- హైదరాబాద్‌లో అత్యధికంగా 4,094 కేంద్రాలు
- ములుగులో అత్యల్పంగా 308 కేంద్రాలు
- ఓటర్ల రద్దీ తగ్గించేందుకు హేతుబద్ధీకరణ
- • కొత్త కేంద్రాలకు అనుగుణంగా బీఎల్ఓల సర్దుబాటు

*తెలంగాణలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 36,353 పోలింగ్ కేంద్రాలు ఖరారయ్యాయి. ఓటర్ల రద్దీని తగ్గించి, ప్రజలకు సమీపంలోనే ఓటు వేసే అవకాశం కల్పించేలా చేపట్టిన పునర్వ్యవస్థీకరణలో కొత్తగా 368 కేంద్రాలు పెరిగాయి. హైదరాబాద్‌లో అత్యధికంగా 4,094, ములుగు జిల్లాలో అత్యల్పంగా 308 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.*

— హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రభాతగమనం):

## హిందూ-ముస్లింలు

# నాకు రెండు కళ్లు

- మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం
- విద్యతో పాటు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి
- 782 మంది ప్రతిభావంతులకు సీఎం అభినందనలు
- నియామకాల్లో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యం
- యువతకు ప్రపంచస్థాయి ఉద్యోగావకాశాలు

*హిందూ–ముస్లింలు తనకు రెండు కళ్లలాంటివారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. మైనారిటీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటే యువతకు దేశ, విదేశాల్లో మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో 782 మంది ప్రతిభావంతులైన మైనారిటీ అభ్యర్థులను సీఎం అభినందించారు.*



04



2

## వరంగల్ టెక్స్ టైల్ పార్కులో

# ఘోర ప్రమాదం

- బాయిలర్ పేలడంతో ఘటన
- లిఫ్టులో చిక్కుకుని యూపీకి చెందిన ఇద్దరు టెక్నీషియన్లు మృతి
- షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు సమాచారం

*వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. గీసుకొండలోని కాకతీయ టెక్స్‌టైల్‌లో గణేశా ఏకోపెట్ కంపెనీలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా బాయిలర్ పేలినట్లు సమాచారం. ప్రమాద సమయంలో లిఫ్టులో చిక్కుకున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాంకేతిక నిపుణులు అభిలాష్ (30), సూర్యప్రకాశ్ (31) మృతి చెందారు. ఘటనపై గీసుకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.*

## నాడు ఉపన్యాసాలు..

# నేడు భూ అమ్మకాలా?

- నాడు కోర్టుకు వెళ్లి నేడు అడ్డగోలుగా అమ్ముకుంటావా?
- రాయదుర్గం హెరిటేజ్ భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

2

*ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా వేలం వేస్తున్నారని బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాయదుర్గంలోని హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వేలానికి పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నెల 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన వివాదాలు పరిష్కారం కాకముందే భూములను విక్రయిస్తే భవిష్యత్తులో సమస్యలు తప్పవని హెచ్చరించారు.*






## మటన్ కూర బాగా లేదని చెప్పిన భర్త..

- కోపంతో మొఖం కాల్చిన భార్య...

వరంగల్ ఆగస్టు 13(ప్రభాత గమనం):

భార్యాభర్తల మధ్య గొడవలు నేరాలకు కారణమవుతున్నాయి. తాజాగా మటన్ కూర రుచిగా లేదని భర్త చెప్పడంతో కోపంతో ఊగిపోయిన భార్య అతనిపై దారుణంగా దాడి చేసిన ఘటన వరంగల్ నగరంలో చోటుచేసుకుంది. మటన్ కూర వండిన భార్య, భర్తకు పెట్టగా బాగోలేదని చెప్పాడు. దీనితో ఆగ్రహానికి లోనైన భార్య, సమీపంలోని గ్యాస్ స్టౌలో మంట లేపి భర్త ముఖంపై కాల్చింది. ఈ దాడిలో భర్త ముఖం, మెడ, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని.. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## ‘వందేమాతరం’తో లోక్‌సభ ప్రారంభం

- పార్లమెంటు చరిత్రలో తొలిసారిగా..
- నిరవధికంగా వాయిదా

న్యూఢిల్లీ ఆగస్టు 13(ప్రభాత గమనం):

భారత పార్లమెంటు చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ కార్యకలాపాలు జాతీయ గేయం’వందే మాతరం’తో ప్రారంభమయ్యాయి. ప్రధాని మోదీతో పాటు సభ్యులంతా సభకు హాజరై వందే మాతరం ఆరు చరణాలను ఆలపించారు. ఆ తర్వాత స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేశారు .జాతీయ గేయం ‘వందేమాతరం’ను అవమానించినా లేదా పాడుతున్నప్పుడు అంతరాయం కలిగించినా కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకునే చట్టానికి ఇటీవల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ నూతన చట్టం ప్రకారం.. జాతీయ గీతం ‘జనగణమన’కు ఏ విధంగా అయితే చట్టపరమైన రక్షణ ఉందో అదే స్థాయి రక్షణ ఇప్పుడు ‘వందేమాతరం’కూ లభించింది.

P-02_Layout 2 14-Aug-26 12:56 AM Page 1



# టీఆర్పీలోకి కొనసాగుతున్న చేరికల జోరు

- మెదక్ జిల్లా నుంచి భారీగా చేరికలు
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- బీసీల రాజ్యాధికారం కోసం నిరంతరం కృషి చేస్తామని వెల్లడి

హైదరాబాద్ ఆగస్టు 13(ప్రభాత గమనం):

ఉమ్మడి మెదక్ జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో గురువారం నాడు చేరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండెల్, రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీఆర్పీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారం దక్కే వరకు తీన్మార్ మల్లన్న నాయకత్వంలో నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం టీఆర్పీ చేస్తున్న పోరాటానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి, గ్రామస్థాయి నుంచి పార్టీని విస్తరించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. బీసీల రాజ్యాధికార లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీని



ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్తామని నూతనంగా చేరిన నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్. భవన వెంకటేష్ తో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యంతో ఆటలొద్దు



- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

న్యూఢిల్లీ,ప్రభాతగమనం ఆగస్ట్13:

అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరి గణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవ గాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసు కుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.



# వరంగల్ టెక్స్ టైల్ పార్కులో ఇద్దరు కార్మికులు మృతి

వరంగల్ ఆగస్టు 13(ప్రభాత గమనం):

వరంగల్ టెక్స్ టైల్ పార్కులో ప్రమాదవశాత్తు ఇద్దరు కార్మికులు మృతి చెందారు. గీసు కొండలోని కాకతీయ టెక్స్ టైల్లో బుధవారం అర్ధరాత్రి ప్రమాదం జరిగింది. గణేశా ఏకోపెట్ కంపెనీలో షార్ట్ సర్క్యూట్ తో బాయిలర్ పేలినట్లు సమాచారం. ప్రమాద సమయంలో లిఫ్టులో చిక్కుకున్న ఉత్తరప్రదేశ్ కు చెందిన సాంకేతిక నిపుణులు అభిలాష్ (30), సూర్య ప్రకాశ్ (31) మృతి చెందారు. గీసుకొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



# వాహనాల బహిరంగ వేలం

- ప్రభుత్వానికి రూ.93,560 ఆదాయం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి మొత్తం రూ.93,560 ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మహబూబాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పి. కరంచంద్ ఆధ్వర్యంలో ఆగస్టు 13న (గురువారం) గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల బహిరంగ వేలం జరిగింది. వేలంలో వాహనాల అమ్మకం ద్వారా రూ.79,700, జీఎస్టీ రూపంలో రూ.13,860 ఆదాయం వచ్చింది. దీంతో ప్రభుత్వానికి మొత్తం రూ.93,560 రాబడి సమకూరింది. ఈ బహిరంగ వేలంలో గూడూరు, చెన్నారావుపేట, నెక్కొండ, నర్సంపేట, వర్ధన్నపేట, మహ బూబాబాద్ ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎక్సైజ్ అధికారి పి. కరంచంద్, గూడూరు ఎక్సైజ్ సీఐ ఎన్. బిక్షపతి, ఎస్సై ఎస్. రాజేశ్వరి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. వేలం కార్యక్రమానికి సహకరించిన పత్రికా ప్రతినిధులు, ప్రజలకు ఎక్సైజ్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.




# ఈసీఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

- అప్రమత్తంగా ఉండాలన్న సీఈవో

హైదరాబాద్,ప్రభాతగమనం,ఆగస్ట్13:

ఈసీఐ పేరుతో వోటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. వోటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఈసీఐ, తెలంగాణ ఎలక్షన్ కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.



# తెలంగాణలో 36,353 పోలింగ్ కేంద్రాలు

హైదరాబాద్ ఆగస్టు 13(ప్రభాత గమనం):

తెలంగాణలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రవ్యా ప్తంగా మొత్తం 36,353 పోలింగ్ కేంద్రాలను అధికారికంగా ఖరారు చేశారు. ఓటర్ల సంఖ్యను సమతుల్యం చేయడం, పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీని తగ్గించడం, ప్రజలకు సమీపంలోనే ఓటు వేసే అవకాశం కల్పించడం లక్ష్యంగా ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. ఈ ప్రక్రియలో కొత్తగా 368 పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 4,094 కేంద్రాలు, ములుగు జిల్లాలో అత్యల్పంగా 308 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొత్త కేంద్రాలకు అనుగుణంగా బిఎల్ఓ లు సర్దుబాటు, ఓటర్ల జాబితా నవీకరణను అధికారులు వేగవంతం చేస్తున్నారు.

# నాడు ఉపన్యాసాలు.. నేడు భూ అమ్మకాలా?

- నాడు కోర్టుకు వెళ్లి నేడు అడ్డగోలుగా అమ్ముకుంటావా?
- రాయదుర్గం హెరిటేజ్ భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 13 :

రాష్ట్రంలో వేలం వెర్రిగా ప్రభుత్వ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా అంటూ ప్రశ్నించారు. ఈమేరకు సీఎంకు ఓ లేఖ రాశా రు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు నేడు ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడి క్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని అని అన్నారు. జీవో ఎం ఎస్ నెం.4 ద్వారా రాయదుర్గ పన్మక్త గ్రామం లోని సర్వే నం.83ను హెరిటేజ్ సైట్‌గా గుర్తించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయన్నారు. హెరి టేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వేలం వేయడం ఏమిటని నిలదీశారు. 2020లో ఇదే భూములపై రక్షణకోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉం డగా ఒక మాట.. అధికారంలోకి వ చ్చాక మరో మాటనా అని ప్రశ్నించారు. ఇదే స ర్వే నంబరు లో గతంలో 6.2 ఎకరాలు ఎకరాకు సుమారు రూ.237 కోట్ల చొప్పున వేలం వేస్తే ఎ స్బీఐ కో ర్టుకు ఎ క్కిందని, ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడిం చారు. అయినా మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏ మిటని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ



అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిప డ్డారు. ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అన్న హామీ ఏమైందని అడిగారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి మాటలకు విలువ లేదా అని ప్రశ్నించారు. ఈనెల 17, 21 తేదీల్లో జరపనున్న వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు.




# మహాముత్తారం పీఎస్ ను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, గురువారం మహాముత్తారం పోలీస్ స్టేషన్‌ను ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసులను నాణ్యతతో దర్యాప్తు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరి ష్కరించాలని అధికారులకు సూచించారు.

# శ్రీ ధర్మశాస్త్ర ఆలయంలో త్రిశూల శివలింగ ప్రతిష్టాపనకు శంకుస్థాపన

- నందీశ్వరుని విగ్రహానికి రూ. 33,300 విరాళం అందించిన కాంగ్రెస్ నాయకులు అంబటి మహేందర్ రెడ్డి
- హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, ప్రముఖ నాయకులు....

కేసముద్రం, ఆగస్టు 13 (ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ శ్రీ ధర్మశాస్త్ర ఆలయంలో త్రిశూల శివలింగ ప్రతిష్టాపన మహోత్సవానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ త్రిశూల శివలింగ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా స్వామివారి వాహన మైన 'నందీశ్వరుని' శిలా విగ్రహ ఏర్పాటుకు జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి-లక్ష్మి దంపతులు రూ. 33,300 విరాళాన్ని ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ శంకుస్థాపన మహోత్సవంలో కేసముద్రం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, ఆర్టీఏ మెంబర్ రావుల మురళి ప్రత్యేకంగా పాల్గొన్నారు.వీరితో పాటు ఆలయ కమిటీ బాధ్యులు, స్థానిక ప్రముఖులు పోలేపల్లి యాకూబ్ రెడ్డి, ఓలం చంద్రుడు, బోగోజు నాగేశ్వరాచారి, కూరెల్లి సతీష్, ఎల్లగౌడ్, రుద్ర శ్రీకాంత్, కోయగురు యాకూబ్ రెడ్డి, కొత్తపల్లి శేఖర్, శ్రీరామ్ కిరణ్, శ్రీరామ్ చంద్రన్, తంగళ్ళపల్లి భాస్కర్, బండారు విజేందర్, రుద్ర సురేందర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ప్రతిష్టాపన కార్య క్రమాలు శాస్త్రోక్తంగా పూర్తయ్యేలా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.






## బీజేపీ నుండి దేశాన్ని కాపాడుకుందాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారధి పిలుపు
- గార్ల మండల కేంద్రంలో ముగిసిన సీపీఐ ప్రజా చైతన్య యాత్ర

గార్ల,ఆగస్టు 13 (ప్రభాత గమనం):

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలందరూ తిరగబడాలని, దేశాన్ని కాపాడుకోవడానికి మార్పు తథ్యమని సీపీఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి. విజయసారధి పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రజా చైతన్య యాత్ర' ముగింపు సందర్భంగా గార్ల మండల కేంద్రంలో "మోడీ పోవాలి.. మార్పు రావాలి" అనే ప్రధాన నినాదాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గార్ల నెహ్రూ సెంటర్ నందు జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గడిచిన పన్నెండేళ్ల నరేంద్ర మోడీ పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని, నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విజయసారధి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అన్ని వర్గాల ప్రజలపై మోయలేని భారాలు మోపుతూ, దేశ ప్రజా సంపదను కార్పొరేట్ దిగ్గజాలైన అంబానీ, అదానీలకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతోందని ఆరోపించారు. రాముని పేరుతో రాజకీయం చేస్తూ సొమ్ము కాజేసిన బిజెపికి పతనం తప్పదని, ఓటమి భయంతోనే మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు.రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ తెలంగాణకు ఒరిగిన ప్రయోజనం శూన్యమని, బిజెపి సర్కార్ మొదటి నుండి తెలంగాణపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తోందని విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని బయ్యారంలో వెంటనే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, అలాగే స్థానికంగా రైల్వే మెయింటెనెన్స్ డిపోను నెలకొల్పి వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి నష్టం చేకూర్చే మున్నేరు–పాలేరు లింకు కెనాల్ జీవో నంబర్ 98ని తక్షణమే రద్దు చేసి, ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ ప్రచార యాత్ర ముగింపు కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్నలతో పాటు నాయకులు రాగం రమేష్, మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్య హరినాయక్, సారిక శ్రీనివాస్, గార్ల ఆరవ వార్డు సభ్యురాలు నీలమ్మ, వెంకటనరసమ్మ, ధూపాటి జనార్ధన్, సింగు రమేష్, బట్టు వీరన్న, ధరవత్ వీరన్న, భూక్య పుల్సింగ్, దార్ల నాగేష్, బాదం రాజేష్, సుధాకర్ రెడ్డి, భీమ్లా పిచ్చయ్య, శ్రీను తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అఘాయిత్యం..

- బెదిరించి పలుమార్లు లైంగిక దాడి..
- బాలిక గర్భం దాల్చడంతో వెలుగులోకి
- కేసు నమోదు.. నిందితుడి అరెస్ట్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మట్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో నిందితుడిని మట్వాడ పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలి తల్లి ప్రైవేట్ రంగంలో పనిచేస్తుండగా, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తన ముగ్గురు కుమార్తెలతో కలిసి ఓ వ్యక్తితో సహజీవనం సాగిస్తోంది. పిల్లల చదువు, కుటుంబ బాధ్యతలను సదరు వ్యక్తి చూసుకునేవాడు. సుమారు మూడేళ్ల క్రితం బాలికను బాలికల వసతి గృహంలో చేర్పించారు. 2025 జూన్‌లో నిందితుడు తల్లికి తెలియకుండా వసతి గృహానికి వెళ్లి బాలికను తన వెంట తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలికపై లైంగిక దాడికి పాల్పడి, విషయం బయటకు చెబితే కుటుంబ సభ్యులను చంపేస్తానని బెదిరించినట్లు పేర్కొన్నారు. దీంతో భయపడిన బాలిక ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోయిందని తెలిపారు. ఆ తర్వాత కూడా పలుమార్లు బాలికను వసతి గృహం నుంచి తీసుకువచ్చి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురై కడుపునొప్పితో బాధపడుతుండటాన్ని తల్లి గమనించి ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. బాలిక జరిగిన ఘటనను తల్లికి చెప్పడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భం దాల్చినట్లు నిర్ధారణ అయింది. దీంతో తల్లి ఫిర్యాదు మేరకు మట్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సంగాల విజయ్‌కుమార్ (38)పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# గార్ల మండలానికి తీరని అన్యాయం

- ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వానికి నిలువుటద్దం!
- మండలంగా ఉన్నా మారని రూపురేఖలు.. పేరుకే మండలం, పనుల్లో శూన్యం..
- రైల్వే స్టేషన్ ఉన్నా సాగని ప్రగతి పయనం.. నిధులున్నా పట్టించుకోని వైనం..
- గార్లను వెంటనే పురపాలక సంఘంగా ప్రకటించాలి
- మౌలిక వసతుల కల్పన, ఆసుపత్రి శ్రేణి పెంపుపై స్థానికుల నిరసన స్వరం




గార్ల,ఆగస్టు 13 (ప్రభాత గమనం):

మండల కేంద్రంగా రూపాంతరం చెంది ఏళ్లు గడుస్తున్నా, గార్ల రూపురేఖలు మాత్రం మారడం లేదు. పేరుకే మండల కేంద్రం తప్ప, అభివృద్ధిలో మాత్రం పాతాళానికి దిగజారింది. ఒక పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పథకాలంటూ ఊదరగొడుతున్నా, గార్ల వైపు చూసే నాథుడే కరువయ్యారని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం తోడు కావడంతో నిధులు కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు అంగుళం కూడా ముందుకు సాగడం లేదు.గార్లలో కీలకమైన రైల్వే స్టేషన్ అందుబాటులో ఉన్నప్పటికీ, దానికి తగ్గ రవాణా సదుపాయాలు లేకపోవడం గమనార్హం. రైల్వే నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాలు పారిశ్రామికంగా, వ్యాపారపరంగా వేగంగా విస్తరిస్తుంటే, గార్లలో మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు కనీస బస్సు రవాణా, స్థానిక కనెక్టివిటీ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధుల కేటాయింపులు జరుగుతున్నట్లు ప్రచారాలు సాగుతున్నా, వాటిని సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గార్ల రోజురోజుకూ విస్తరిస్తున్న తరుణంలో, దీనిని తక్షణమే పురపాలక సంఘంగా (మున్సిపాలిటీ) గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామ పంచాయతీ స్థాయి నిధులతో మండల కేంద్రం యొక్క అవసరాలను తీర్చడం సాధ్యం కావడం లేదు. గార్లను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు వచ్చి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని మేధావులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. అయితే రహదారుల విస్తరణ చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. రాత్రి వేళల్లో వాహనదారులు, బాటసారులు చీకట్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. పట్టణ తరహాలో ప్రధాన రహదారులను విస్తరించి, సెంట్రల్ డివైడర్లు నిర్మించి, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో అత్యంత కీలకమైన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది. గార్లతో పాటు చుట్టుపక్కల అనేక గ్రామాల ప్రజలు అత్యవసర వైద్యం కోసం ఈ ఆసుపత్రిపైనే ఆధారపడతారు. కానీ, అత్యవసర చికిత్సా పరికరాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న ప్రమాదం జరిగినా లేదా ఆకస్మిక అనారోగ్యానికి గురైనా పక్కన ఉన్న పెద్ద పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసి, అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు నిద్రమత్తు వీడి గార్ల మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి. మున్సిపాలిటీగా ప్రకటించడం, రోడ్ల విస్తరణ, ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ పనులను తక్షణమే యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. లేనిపక్షంలో ప్రజా సంఘాలు, స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతాం!"

## నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎంపీ వేం పీఆర్వోకు వినతిపత్రం అందజేత
- ఉద్యమ సమయం నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించిన నాయకులు

కేసముద్రం,ఆగస్టు 13 (ప్రభాత గమనం):



తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసముద్రం మండల ఉద్యమకారులకు రాబోయే నామినేటెడ్ పదవుల భర్తీలో సముచిత స్థానం కల్పించాలని మండల తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ప్రజా సంబంధాల అధికారి తలకంటి జగదీశ్ రెడ్డి గారిని కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కేసముద్రం మండల ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు చాగంటి కిషన్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘంగా పదిహేనేళ్ల పాటు నిరంతరం పోరాటం చేశామని గుర్తుచేశారు. స్థానికంగా అనేక నిరసన కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచామని తెలిపారు. రాష్ట్ర సాధన సమరంలో పాల్గొనడం వల్ల చదువుకునే వయస్సులో విద్యకు, సంపాదించే సమయంలో ఆర్థికాభివృద్ధికి దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమానికి సమయాన్ని వెచ్చించడం వల్ల ఉద్యోగాలు సాధించలేక, ప్రస్తుతం ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు.ప్రస్తుతం కేసముద్రం పురపాలక సంఘం, వ్యవసాయ విపణి కమిటీ , ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీలో ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధి గుగులోత్ దస్రూ నాయక్, మండల ఉద్యమకారుల వేదిక ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, విద్యార్థి–యువజన జాయింట్ యాక్షన్ కమిటీ మాజీ అధ్యక్షుడు దండు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



ఐనవోలు మండలంలోని పంతిని గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి రావి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో 25 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఐనవోలు ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. పంతిని గ్రామానికి చెందిన ఉప్పరి రాజు కుమారుడు ఉప్పరి సాంబరాజు (25) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి మోటార్‌సైకిల్ (AP 36 H 5784)పై బయటకు వెళ్లిన సాంబరాజు అర్ధరాత్రి దాటిన తర్వాత వరంగల్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పంతిని గ్రామ శివారులో వెంకటేశ్వర గ్రానైట్ ఎదురుగా బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న రావి చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాంబరాజు ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదంపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తండ్రి రాజు పోలీసులకు తెలిపినట్లు ఎస్సై వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐనవోలు పోలీసులు తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

- 15 లీటర్ల గుడుంబా స్వాధీనం..
- 250 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

గుడుంబా తయారీ, విక్రయాలపై తొర్రూరు పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని భీముని తండాలో గురువారం తెల్లవారుజామున ఎస్సై మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్న పోలీసులు, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై మహేందర్ రెడ్డి తెలిపారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## పెండింగ్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి

- మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గందసిరి జ్యోతి, బసుపట్ల మధు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి

మహబూబాబాద్ ఆగస్టు 13(ప్రభాత గమనం):

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్ మరియు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంధసిరి జ్యోతి బస్సు పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ కలెక్టరేట్ వద్ద వందలాది మంది విద్యార్థులతో ముట్టడించారు.గేట్లు ఎక్కేందుకు విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు ప్రయత్నించడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంధసిరి జ్యోతి బసు,పట్ల మధు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న సరే విద్యా రంగ సమస్యలు పరిష్కరించలేదని మండిపడ్డారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల కాకపోవడం వల్ల పేద విద్యార్థులకు చదువు అనేది అందని ద్రాక్షగా మారిందని విమర్శించారు.జిల్లాలో ఉన్నటువంటి గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో, విద్యాశాఖ విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకులను నొక్కుతుందని ధ్వజమెత్తారు. మహబూబాబాద్ జిల్లాకు మంజూరైన రెండు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మాణాలను ఎప్పుడు పూర్తి చేస్తారనేది విద్యార్థులకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ సింహాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి ఎండి అమీర్, గుండ్ల రాకేష్,జిల్లా నాయకులు కోల్పాక వీరేందర్, పెద్దపులి బాసు, వంశీ, గణేష్, చందు,అఖిల, ప్రసన్న పాల్గొన్నారు.







## పోలీస్ అధికారుల సంఘానికి కొత్త కార్యవర్గం

- పారదర్శకంగా ముగిసిన ఎన్నికలు..
- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ ఎన్. శ్వేత
- 110 మంది పోలీస్ అధికారుల ఓటింగ్
- నూతన కార్యవర్గానికి అభినందనలు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం కమిషనరేట్ కార్యాలయంలోని రాణి రుద్రమదేవి ప్రాంగణంలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు సదయ్య, నాగయ్య పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. వివిధ హోదాల్లో పని చేస్తున్న మొత్తం 110 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఎన్నికలు జరుగుతున్న ప్రాంగణానికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులకు సూచించారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కొండా కరుణాకర్ తన సమీప ప్రత్యర్థి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి. బాబుపై 17 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. దీంతో వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా కొండా కరుణాకర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి. సతీష్ (ఆర్ఐ), బి. శరత్ కుమార్ (ఆర్ఎస్ఐ), ప్రధాన కార్యదర్శిగా ఇ. వీరభద్రరావు (దామెర ఎస్ఐ), సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్ (కాజీపేట కానిస్టేబుల్), కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్ కుమార్ (ఏఆర్ కానిస్టేబుల్), కోశాధికారిగా బి. నరేష్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా యం. తులసి (మహిళా కానిస్టేబుల్, కాజీపేట), సి.హెచ్. మహేందర్ యాదవ్ (ఏఆర్ కానిస్టేబుల్), ఏ. రమేష్ (ఏఆర్ కానిస్టేబుల్), ఎన్. ప్రవీణ్ (సుబేదారి కానిస్టేబుల్), యం.డి. తాజుద్దీన్ (హన్మకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్), పి. సర్వేశ్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అభినందించారు. పోలీస్ అధికారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, అధికారుల మధ్య సమన్వయం పెంపొందించే దిశగా నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల నోడల్ అధికారి, నిర్వహణ కమిటీ సభ్యులు, సంబంధిత పోలీస్ అధికారులను కూడా కమిషనర్ అభినందించారు.

# సీఎం పర్యటనకు మేడారం ముస్తాబు

- ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- సమ్మక్క–సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్ల పంపిణీకి శ్రీకారం
- మంత్రి దనసరి అనసూయ సీతక్క

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 16న మేడారంలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని, ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సమ్మక్క–సారలమ్మ వనదేవతల సన్నిధి నుంచి అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమా నికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. గురువారం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి మేడారంలోని సమ్మక్క–సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పెండింగ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండుసార్లు మేడారం ప్రాంగణాన్ని సందర్శించి సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు మహాజాతరకు ముందు కుటుంబ సమేతంగా మేడారానికి వచ్చి వనదేవతలను దర్శించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో బస చేసి ములుగు జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించారని తెలిపారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి మరోసారి మేడారానికి రానున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మిగిలిన తుది దశ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి భవిష్యత్తులో చేపట్టా ల్సిన విస్తరణ, అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, మార్గదర్శక త్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మేడారానికి వచ్చే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ములుగు జిల్లా, నియోజకవర్గ ప్రజల తరపున ఘన స్వాగతం పలుకుతున్నా మని మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి మేడారం ఆలయ ప్రాంగణంలో పర్యటించనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. వనదేవతలను దర్శించు కున్న అనంతరం సమ్మక్క–సారలమ్మ సన్నిధి నుంచే అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, అర్హులను గుర్తించి పింఛన్లు అందించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా పేర్కొన్నారు. సమ్మక్క–సారలమ్మ తల్లుల దీవెనలతో ప్రతి మహిళ సంతోషంగా, ఆత్మగౌర వంతో జీవించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని వారి సన్నిధి నుంచే ప్రారంభిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూర్‌నాగారం ఏఎస్పీ మనన్ భట్, జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, గుత్తేదారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల ప్రక్రియ పూర్తి ..

- హర్షం వ్యక్తం చేసిన అభ్యర్థులు

మహబూబాబాద్ ఆగస్ట్(ప్రభాత గమనం):

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేసిన జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ గురువారం జిల్లా కలెక్టరేట్ లో అర్హులైన 16 మంది అభ్యర్థులకు శాఖల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించి ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తి చేశారు. సకాలంలో నియామక ప్రక్రియ పూర్తి కావడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు ఉద్దేశించిన కారుణ్య నియామకాల ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ వేగవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..."కష్టసమయంలో ఉన్న ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత. నియమితు లైన అభ్యర్థులు తమ విధులను పూర్తి నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించి ప్రభుత్వానికి, ప్రజలకు మంచి సేవలు అందించాలని, రోస్టర్ పాయింట్ల ప్రకారం, రెవెన్యూ విభాగానికి జూనియర్ అసిస్టెంట్లు 5, అటెండర్లు 6 , ఇతర విభాగాలకు జూనియర్ అసిస్టెంట్, అటెండర్ కేడర్లలో 5 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి కేటాయించడం జరిగిందని అన్నారు. సమయం వృథా కాకుండా, పారదర్శకమైన విధానంలో నియామక ప్రక్రియను పూర్తి చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించడం పట్ల ఉద్యోగార్థులు, మొరా మమత, వజ్జ రజిత, ఇస్లావత్ శ్వేత, ధనసరి రమణ, తదితర (16) మంది అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్ కి ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.



## వర్ధన్నపేటలో రోడ్డు ప్రమాదం

- చికిత్స పొందుతూ కూలీ మృతి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వర్ధన్నపే టలోని ఇల్లంద గ్రామానికి చెందిన మహమ్మద్ యాకుబ్ (52) రోజువారీ కూ లీగా జీవనం కొనసాగిస్తున్నాడు, ప్రతిరోజూ లాగే కూలి నిమిత్తం వరంగల్‌కు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో 12వ తేదీన మధ్యాహ్నం సుమారు 3.15 గంటలకు గ్రామంలోని ప్రధాన రహదారిపై బేతి సాంబయ్య ఇంటి సమీపంలో ఆటో నుంచి దిగాడు. అనంతరం రహదారి దాటుతుండగా వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న క్విడ్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాకుబ్ ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వెంటనే యాకుబ్‌ను 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా పరిస్థితి విషమించడంతో ఆగస్టు 13న తెల్లవారుజామున సుమారు 4 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహమ్మద్ జామల్ (26) ఇచ్చిన ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట ఎస్సై ఎన్. సాయి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## హిందూ ముస్లింలు రెండు కళ్లు

- మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యం
- విద్యతో పాటు నైపుణ్యాలు అవసరం
- నియామకాల్లో పారదర్శకతే లక్ష్యం
- యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 13(ప్రభాత గమనం):



హిందూ – ముస్లింలు ఇద్దరూ నాకు రెండు కళ్లలాంటి వారు" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమితులైన అభ్యర్థులు తెలంగాణ రైజింగ్ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారి టీల ప్రతిభా సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గ్రూప్ 1, 2, 3, 4 తదితర కేటగిరీల్లో జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఎంపికైన, అలాగే నీట్, ఐఐటీ, ఎన్ఐటీ లాంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 782 మంది మైనారిటీ అభ్యర్థులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సలహాదారు షబ్బీర్ అలీ, ఫహీముద్దీన్ ఖురేషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..ప్రజాప్ర భుత్వం మైనారిటీల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివ రించారు. "చదువొక్కటే మన భవిష్యత్తును మార్చుతుంది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదువుకోవాలి. ఆ తర్వాత నుంచి విద్యార్థులు స్కిల్స్ పై దృష్టి సారించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో స్కిల్స్ ఉంటే ఉద్యోగావకాశాలకు కొదవలేదు. స్కిల్స్ ఉన్నవారికి జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. స్కిల్ ్ఉలో యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతోనే ఐటీఐలను ఏటీసీలుగా మార్పు చేశాం. పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్స్ యూనివ ర్సిటీ పరిధిలోకి తెచ్చాం. నైపుణ్యం ఉంటే భవిష్యత్తు మారుతుంది. ఎంతో కష్టపడుతున్న చిన్న చిన్న కుటుంబాల నుంచి ఎంతగానే కృషి చేసి ఈ ఉద్యోగాలు సాధించుకున్న మీ అందరికీ అభినంద నలు. మైనారిటీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించా లన్న ప్రయత్నాలు జరిగాయి. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదు. సంక్షేమ కార్యక్రమాల్లో మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నా మని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వల్ల మైనారిటీలకే ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ –1 తో పాటు ఉద్యోగ నియామకాలేవీ జరగలేదు. గ్రూప్ – 1 కు సంబంధించి ఒకసారి ప్రయత్నం జరిగినప్పటికీ పల్లీ బఠానీల్లా పరీక్షా పత్రాలను మార్కెట్ లో విక్రయించారు. గ్రూప్ –1, 2 లాంటి పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయాలంటే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత కలిగిన వారు సభ్యులుగా ఉండాలి. అనామకులను సర్వీసు కమిషన్‌లో నియమించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌తో పాటు నిపుణు లతో సమాలోచనలు జరిపి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశాం. రాష్ట్రంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను అడ్డుకోవాలని అనేక అడ్డంకులు సృష్టించారు. మీరంతా మా కుటుంబ సభ్యులుగా భావించి హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఉద్దండులైన న్యాయవాదులను నియమించి పోరాటం చేసి నియామ కాలను పూర్తి చేశాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## విజయ డెయిరీ పునరుద్ధరణకు చర్యలు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు త్వరలోనే చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. పాడి రైతులకు అండగా నిలిచి పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించేందుకు విజయ డెయిరీని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం విజయ డెయిరీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పాల సేకరణ కేంద్రం, శీతలీకరణ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, పాల నాణ్యత పరీక్షించే ప్రయోగశాలను పరిశీ లించారు. పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలు, ప్రాసెసింగ్, పాల ఉత్పత్తుల తయారీపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాడి రైతుల సంక్షేమ సంఘం సభ్యులు, రైతులు, బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పశుపోషణ ద్వారా రైతులు వ్యవసా యంతో పాటు నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. నాణ్యమైన పశువు లను ఎంపిక చేసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విజయ డెయిరీతో పశుసంవర్ధక శాఖను అనుసంధానం చేసి రైతులకు ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువైద్య సేవలు, పాల ఉత్పత్తి పెంపుపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. విజయ డెయిరీలో నెయ్యి, పన్నీరు తదితర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసేలా ఆధునిక యంత్రాలు, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రసాయనాలు కలపకుండా స్వచ్ఛమైన పాలను అందించేందుకు డెయిరీ చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేస్తున్నామని తెలిపారు. 26 సొసైటీల ద్వారా పాలను సేకరిస్తున్నామని, పాల సేకరణ తగ్గడంతో ఉత్పత్తి సామర్థ్యం కూడా తగ్గిందన్నారు. రైతులను పాడి పరిశ్రమ వైపు ప్రోత్సహించి రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యాన్ని చేరుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ విజయ డెయిరీ సొసైటీ చైర్మన్ ఎరుపు దేవేందర్, కమిటీ సభ్యులు సమ్మయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ చైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి, పాడి రైతులు, డిస్ట్రిబ్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా
- అసెంబ్లీ ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్

గార్ల,ఆగస్టు 13 (ప్రభాత గమనం):




శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆల్ హమాలీ కార్మికులకు తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హమాలీల సమస్య లను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా, స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆల్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వ హించారు.ఈ సందర్భంగా కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, వారి సంక్షేమానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలని కోరారు. హమాలీలను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించి, వారికి ఉచిత వైద్య సదుపాయాలు మరియు ఆరోగ్య పత్రాలు అందించాలని స్పష్టం చేశారు. అలాగే, శ్రమ పత్రాల అంతర్జాల వేదికలో కార్మికుల పేర్లను నమోదు చేసి, సామాజిక భద్రతా పథకాలను వర్తింపజేయాలని ఆయన పేర్కొన్నారు.55 సంవత్సరాలు దాటిన వయోవృద్ధ హమాలీ కార్మికులకు నెలకు ఆరు వేల రూపాయల పింఛను మంజూరు చేయాలి.నివాస స్థలం లేని హమాలీ లకు ఉచితంగా స్థలాన్ని కేటాయించి, రెండు పడకల గదుల ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. నిర్వహణలో ప్రమాదవశాత్తు మర ణించిన కార్మికుడి కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలి.ఎల్ వో తీర్మానం ప్రకారం 50 కిలోలకు మించిన బస్తాల బరువును తక్షణమే నిరోధించాలి. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిప త్రాన్ని తహసీల్దార్ శారదకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో నిత్యావసర సరుకుల సరఫరా హమాలీ సంఘం రాష్ట్ర నాయకుడు అంబటి వీరస్వామి, హమాలీ సంఘం నాయకులు యు. మల్లయ్య, డి. ప్రవీణ్, సర్వర్, వి. ఇస్తారి, కోటయ్య, సాయి, రాజు, సర్వయ్య, ఈ. వెంకన్న, సమ్మయ్య, లక్ష్మి, బుజ్జి, సత్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఖనిజ సంపద దేశానికి వెన్నెముక

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

న్యూఢిల్లీ ఆగస్టు 13(ప్రభాత గమనం):



పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్మాణం,తయారీ రంగం, స్వచ్ఛ ఇంధన సాంకేతిక తలు, ఖనిజ సంపద దేశ భద్రతకు వెన్నెముక వంటిదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. అభివృద్ధి చెందిన భార తదేశ నిర్మాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఈ సమయంలో, కీలక ఖనిజాలు, అరుదైన భూలోహా లు, వ్యూహాత్మక ఖనిజాల అవసరం మరింత పెరగ నుందన్నారు.గనులు, ఖనిజాలు (అభివృద్ధి, ని యంత్రణ)సవరణ –2026 బిల్లుపై రాజ్యసభలో గు రువారం జరిగిన చర్చ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడారు. పారదర్శకమైన, స్థిరమైన, పెట్టుబడిదా రులకు విశ్వాసాన్ని కలిగించే గనుల విధానం దేశ ఆర్థికాభివృద్ధికి అత్యంత అవసరమని ఆయన అభిప్రా యపడ్డారు. ఈ సవరణ బిల్లు ప్రధాన ఉద్దేశ్యం గనుల రంగంలో పన్నులు, సెస్‌లు, ఇతర రుసుముల విధానంలో స్పష్టత, ఏకరూపత తీసుకురావడం అన్నారు. ఖనిజ హక్కులు,గనుల భూములపై రాష్ట్రాలు విధించే పన్నులు, రుసుంల విషయంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిబంధనలు, పరిమితులు నిర్దేశించే అధికారం పొందుతుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. దీనివల్ల బహుళ పన్నుల భారం తగ్గి, పెట్టు బడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంద న్నారు. ఇప్పటికే రాష్ట్రాలు వసూలు చేసిన మొత్తాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిని తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని కూడా ఈ బిల్లు స్పష్టం చేస్తున్నదని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374